

'పట్టభద్రుల'పై పార్టీల ఫోకస్



వేడెక్కుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

లోక్‌సభ ఎన్నికల ఘట్టం ముగియడంతో రాజకీయ పార్టీలన్నీ నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై దృష్టిసారించాయి. ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ జరగనుంది. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గతంలో ఈ స్థానం నుంచి ఎన్నికైన పల్లా రాజేశ్వరరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడంతో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఫలితంగా ఉప ఎన్నిక వచ్చింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52మంది బరిలో నిలిచారు. అయినా ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే జరగనుంది. 27న పోలింగ్, జూన్ 5న కౌంటింగ్ నిర్వహించనున్నారు.

- రంగంలోకి ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు
- 27న పోలింగ్.. జూన్ 5న కౌంటింగ్

ఖమ్మం, మే 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు ఉమ్మడి జిల్లాల్లో 4,63,839మంది ఓటర్లున్నారు. ఇందులో ఖమ్మం జిల్లా పరిధిలో 83,879మంది ఓటర్లుండగా పురుషులు 50,676, మహిళలు 33,199 మంది ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40,106 మంది ఓటర్లుండగా పురుషులు 22,590, మహిళలు 17,516 మంది ఉన్నారు. దీంతో పట్టభద్రుల ఉపఎన్నికలో ఉమ్మడి ఖమ్మంజిల్లా ఓట్లు కీలకం కాబోతున్నాయి. గతంలో పల్లా రాజేశ్వరరెడ్డి విజయంలోనూ ఖమ్మం జిల్లా ఓట్లే కీలకమయ్యాయి. దీంతో అన్ని పార్టీ అభ్యర్థుల దృష్టి ఖమ్మం జిల్లాపైనే ఉంది. కాంగ్రెస్‌నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పట్టభద్రుల ఎన్నికను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న జిల్లా మంత్రులను కలిసి తన విజయం కోసం కృషి చేయాలని కోరారు. తీన్మార్ మల్లన్న శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి తన విజయం కోసం కృషి చేయాలని కోరారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ పది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను కూడా నియమించింది. పినపాక నియోజకవర్గం కో-ఆర్డినేటర్‌గా బిక్కసాని నాగేశ్వరరావు, ఇల్లెందుకు మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం నూకల నరేష్‌రెడ్డి, పాలేరుకు ఎం.రఘునాథ్‌యాదవ్, మధిరకు మహ్మద్ జావీద్, వైరాకు బొర్ర రాజశేఖర్, సత్తుపల్లికి రాయల నాగేశ్వరరావు, కొత్తగూడేనికి తుళ్లూరి బ్రహ్మయ్య, అశ్వారావుపేటకు పిడమర్తి రవి, భద్రాచలానికి తోటకూర రవిశంకర్‌లను కో-ఆర్డినేటర్లుగా నియమిస్తూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.మల్లేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు.

పట్టభద్రుల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ కూడా రంగంలోకి దిగింది. ఆ పార్టీ నేతలు జిల్లాలో సభలు, ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యాసంస్థలు, విద్యావంతులను ఆయా వృత్తుల వారిని, ఉద్యోగులను కలిసి మద్దతు కూడగడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్షంగా తామే పోటీ ఇచ్చామని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను నిలదీసే సత్తా తమకే ఉందని బీజేపీ నేతలు చెబుతున్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమి చెందారు. ఆయన గెలుపుకోసం ఖమ్మంలో బీజేపీ నేతలు మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, కిసాన్‌మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ కార్యాలయానికి వెళ్లి మద్దతు అడిగారు.



హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలను కలిసిన తీన్మార్ మల్లన్న

గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలో మెజారిటీ ఓటు బ్యాంకు సాధించిన బీఆర్‌ఎస్ ఈసారి కూడా తన పట్టు నిలుపుకోవాలని భావిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఆయన జిల్లాలో ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. జిల్లాకు చెందిన ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలను కలిసి మద్దతు కోరారు. హైదరాబాదులో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని జిల్లా నేతలకు కేటీఆర్ సూచించారు. దీంతో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో ప్రచారం ప్రారంభించారు. ఈ ఎన్నికకు సంబంధించి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌లను ప్రకటించింది. ఖమ్మానికి సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుండాల కృష్ణ, పాలేరుకు తాళ్లూరి సృజన్‌కుమార్, సత్తుపల్లికి ఎండీ ఖమర్, మధిరకు బిచ్చాల తిరుమలరావు, వైరాకు లకావత్ గిరిబాబును ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. భద్రాద్రి జిల్లాకు కూడా ఇన్‌చార్జ్‌లను నియమించనున్నారు. మొత్తంమీద మూడు ప్రధానపార్టీల అభ్యర్థులు ఎన్నికల్లో విజయం కోసం ముమ్మర యత్నాలు ప్రారంభించారు. పోలింగ్‌కు సమయం తక్కువగా ఉన్నందున ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మండల, జిల్లానాయకులు ప్రచార బరిలో దిగుతున్నారు.



ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న తాతా మధు



ఖమ్మం నగరంలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు షురూ

- 140 జంబో.. మరో 140 చిన్న బ్యాలెట్ బాక్సులు సిద్ధం
- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా అదనపు కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మే 17: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉపఎన్నికల కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. 27న పోలింగ్, జూన్ 5న కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్‌కు సిబ్బంది నియామకం పూర్తి చేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. 142మంది పీవోలు, 142మంది ఏపీవోలు, 284 మంది ఓపీవోలు అవసరం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ వ్యవహరించనున్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన తుదిజాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 83,879 మంది పట్టభద్రుల ఓటర్లు నమోదుకాగా, ఇందులో 50,676మంది పురుషులు, 33,199మంది మహిళలు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. రిజర్వ్‌తో కలుపుకొని 129బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1000మంది చొప్పున ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు ఇలా

జిల్లాలో మొత్తం 118 పోలింగ్ కేంద్రాలకు 140 జంబో మరో 140 చిన్న బ్యాలెట్ బాక్సులతో పాటు రిజర్వ్‌గా మరో 70బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్నారు. ఖమ్మంలోని ఎస్సార్‌బీజీఎన్నార్ డిగ్రీ కళాశాలలో పోలింగ్‌కు ముందు రోజు సామగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను నల్లగొండకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారి ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లతో ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున పోలింగ్ సిబ్బందిని నియమించారు. తహసీల్దార్లు లైజనింగ్ అధికారులుగా, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (నాయబ్ తహసీల్దార్లు) వీడియోగ్రఫీ బృందాలుగా విధులు నిర్వహించనున్నారు. పోలింగ్ రోజున వెబ్‌కాస్టింగ్‌తో పాటు ఎన్నికల బాధ్యతలను నోడల్ ఆఫీసర్లు నిర్వహించనున్నారు.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం

ఖమ్మం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని గోదాముల్లో నిల్వ ఉంచిన బ్యాలెట్ బాక్సులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. మే 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ పోలింగ్‌లో 52మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీంతో బ్యాలెట్ పెద్దదిగా ఉంటుందని భావిస్తున్నారు.

పల్లెపోరుకు కసరత్తు

- ఓటరు జాబితా తయారీకి సన్నాహాలు
- బ్యాలెట్ బాక్సుల కోసం 20న ఏపీకి వెళ్లనున్న అధికారులు
- షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 2లోపు ఎన్నికల నిర్వహణ
- జిల్లాలో 589 పంచాయతీలు, 5,379వార్డులు



ఖమ్మం కలెక్టరేట్, మే 17: త్వరలో పంచాయతీల ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. వాస్తవానికి ఫిబ్రవరి 2నే పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కొత్త ప్రభుత్వం వెంటనే ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా లేకపోవడం, బీసీ ఓటర్ల గణన తదితర కారణాలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. అయితే తాజా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సర్కార్ దృష్టి పెట్టింది. ఇందుకోసం కసరత్తు ప్రారంభించింది. షెడ్యూల్ ప్రకారం జూన్ మొదటివారంలో వార్డుల విభజన, రెండో వారంలో రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఎన్నికల కమిషన్ నుంచి పంచాయతీ అధికారులకు ఆదేశాలు అందాయి. పోలింగ్‌కు కావాల్సిన బ్యాలెట్ బాక్సులకు సంబంధించి ఏపీలోని కాకినాడ, విజయవాడ నుంచి సుమారు 6వేల బ్యాలెట్ బాక్సులను సమకూర్చుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి అధికారులు సోమవారం ఏపీకి వెళ్లనున్నారు.

ఖమ్మం జిల్లాలో 584 పంచాయతీలు, మరో 6 విలీన పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మొత్తం 5,379 వార్డులున్నాయి. పంచాయతీల పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 2నే ముగియడంతో ప్రస్తుతం అన్ని పంచాయతీల్లోనూ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే బీసీ జనాభా లెక్కలు సరిగ్గా లేవనే ఆరోపణల నేపథ్యంలో బీసీ గణన పూర్తి చేస్తారా లేదంటే ఉన్న రిజర్వేషన్లనే అమలు చేస్తారా అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. సర్పంచ్‌ల రిజర్వేషన్ జనాభా ప్రకారం గ్రామ వార్డుల రిజర్వేషన్‌ను ఓటర్ల ఆధారంగా కేటాయిస్తారు. బీసీ ఓటర్ల ఆధారంగా బీసీ జనాభా (ప్రొఫరేషన్ పాపులేషన్)ను లెక్కిస్తారు. దాదాపుగా వచ్చిన ఇదే బీసీ జనాభాను పరిగణలోకి తీసుకుని సర్పంచ్‌ల రిజర్వేషన్లు కేటాయిస్తారు. ఇదిలా ఉండగా ఖమ్మం విలీన పంచాయతీలకు ఈసారి ఎన్నికలు నిర్వహించే విషయమై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

అసెంబ్లీ ఓటర్లతోనే ఎన్నికలు..

సర్పంచ్ ఎన్నికలకు పంచాయతీల్లో కొత్త ఓటర్ల నమోదు తొలగింపు అనేది ఉండదు. అసెంబ్లీ ఎన్నికల కోసం సిద్ధం చేసిన ఓటరు జాబితానే పరిగణలోకి తీసుకుని పంచాయతీ ఎన్నికలకు వినియోగిస్తారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఉండే అసెంబ్లీ ఓటర్లను పంచాయతీలు, వార్డుల వారీగా విభజించి ప్రత్యేక ఓటరు జాబితాలను తయారు చేస్తారు. అయితే ఇదివరకు గ్రామాల్లో జాబితా సిద్ధం చేసినా కొత్తగా ఓటర్లు పెరగడం పలుచోట్ల ఓటర్ల తొలగిపోవడంతో కొత్త జాబితాలు తయారు చేయాల్సి వస్తుందని భావిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

ఖమ్మం జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉండగా వీటిలో ఏజెన్సీ మండలాలు 2, మైదాన ప్రాంత మండలాలు 15 ఉన్నాయి. ఏజెన్సీలో కలిసి ఉన్న మండలాలు మూడు ఉన్నాయి. వీటిల్లో మొత్తం పంచాయతీలు 584కాగా మైదానప్రాంత మండలాల్లో 485 పంచాయతీలు ఉన్నాయి. ఏజెన్సీ మండలాల్లో ఉన్న పంచాయతీలు 99వరకు ఉన్నాయి. 100శాతం ఎస్టీ జనాభా కలిగిన పంచాయతీలు 11 వరకు ఉన్నాయి. వీటికి రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉంటుంది. వీటిలో ఏజెన్సీ పంచాయతీల్లో ఎస్టీలకు కేటాయించాల్సి ఉంటుంది.

పైసా వసూల్!



- రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం పెంచే దిశగా సర్కార్ చర్యలు
- మూడేళ్ల క్రితం భూముల మార్కెట్ విలువ పెంపు
- మరోమారు 'విలువ' పెంచే దిశగా కసరత్తు
- హైవేలు, శివారు ప్రాంతాల్లో ధరలు పెరిగే అవకాశం

ఏడాదికి ఆదాయ వ్యత్యాసమిలా..

ప్రాంతం	2021 ముందు	2021 తరువాత
ఖమ్మం	రూ.41.58 కోట్లు	రూ.92.54 కోట్లు
ఖమ్మంరూరల్	రూ.17.51 కోట్లు	రూ.29.63 కోట్లు
కూసుమంచి	రూ.6.79 కోట్లు	రూ.16.47 కోట్లు
సత్తుపల్లి	రూ.5.45 కోట్లు	రూ.8.04 కోట్లు
వైరా	రూ.4.56 కోట్లు	రూ.8.00 కోట్లు
కల్లూరు	రూ.2.20 కోట్లు	రూ.3.55 కోట్లు
మధిర	రూ.5.88 కోట్లు	రూ.11.37 కోట్లు
కొత్తగూడెం	రూ.14.25 కోట్లు	రూ.51.08 కోట్లు
ఇల్లందు	రూ.2.09 కోట్లు	రూ.8.60 కోట్లు
బూర్గంపాడు	రూ.44.21 లక్షలు	రూ.1.27 కోట్లు
భద్రాచలం	రూ.1.49 లక్షలు	రూ.4.32 లక్షలు

ఖమ్మం కార్పొరేషన్, మే 17: స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఎక్కువగా ఆదాయం పొందేందుకు స్థలాల మార్కెట్ విలువను పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. పెంచిన స్థలాల మార్కెట్ విలువతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరిగే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం అంటే 2021 ఫిబ్రవరి, జూలైల్లో ప్రభుత్వం స్థలాల మార్కెట్ విలువలను పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. స్థలాలు ఉన్న ప్రాంతాన్ని బట్టి అప్పుడు ఉన్న మార్కెట్ విలువకు 20నుంచి 30శాతం పెంచారు. దీంతో స్థలాల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రజలపై భారం పడినా, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖకు మాత్రం ఆదాయం పెరిగింది. ప్రభుత్వం స్థలాల విలువ పెంచటంతో బహిరంగ మార్కెట్‌లో స్థలాల విలువలు భారీగా పెరిగాయి. జిల్లా కేంద్రమైన ఖమ్మంలో ప్రస్తుతం ఉన్న సిటీబస్టాండ్ (పాత బస్టాండ్) వద్ద గజం రూ.లక్షకు చేరింది. అలాగే వాణిజ్య ప్రాంతాల్లో స్థలాలకు సైతం ప్రభుత్వ మార్కెట్ విలువ భారీగా పెరిగింది. గతంలో మార్కెట్ విలువ పెరగటంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా రూ.130కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. 2020 ఏప్రిల్ నుంచి 2021 మార్చి వరకు 50,466 రిజిస్ట్రేషన్లు జరగ్గా, రూ.101.72 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం స్థలాల మార్కెట్ విలువ పెంచిన తరువాత 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చివరకు 57,816 రిజిస్ట్రేషన్లు జరగగా రూ.230.63కోట్ల ఆదాయం వచ్చింది. అంటే సుమారు రూ.130కోట్ల అదనపు ఆదాయం వచ్చింది.

హైవేలు, శివారు ప్రాంతాల్లో ధరలు పెరిగే అవకాశం

బహిరంగ మార్కెట్ విలువకు ప్రభుత్వ మార్కెట్ విలువకు మధ్య ఉన్న అంతరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మార్కెట్ విలువను పెంచాలని యోచిస్తున్న నేపథ్యంలో హైవేల సమీపంలో శివారు ప్రాంతాల్లో మార్కెట్ ధరలు పెరిగే అవకాశం ఉంది. విలీన పంచాయతీల్లో గజం బహిరంగ మార్కెట్‌లో రూ.15వేలు ఉండగా, ప్రభుత్వ మార్కెట్ విలువ మాత్రం గజానికి రూ.1,200నుంచి రూ.1,500 వరకు ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ ఫీజులు తగ్గుతున్నాయి. ఇటువంటి వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మార్కెట్ ధరను పెంచే అవకాశం ఉంది. అలాగే హైవే రహదారులు వెళ్లే చింతకాని మండలం వందనం, తదితర ప్రాంతాల్లో ఎకరం భూమి రూ.కోటి వరకు బహిరంగ మార్కెట్‌లో పలుకుతుండగా, ప్రభుత్వ ధర మాత్రం ఎకరానికి రూ.5లక్షలు మాత్రమే ఉంది. ఇక్కడ కూడా మార్కెట్ విలువ పెంచే అవకాశం ఉంది. ఇలా పలు ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ ధర ప్రభుత్వ మార్కెట్ ధరను పరిగణలోకి తీసుకుని విలువ పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు పూర్తి ఆదేశాలు రాకున్నా ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నివేదికలు తయారు చేస్తున్నారు.

డీసీసీబీలో బదిలీల వివాదం

- కోడ్ సమయంలో భారీగా బదిలీలు
- పాలకవర్గానికి తెలియకుండానే సీఈవో ఉత్తర్వులు?
- మంత్రి తుమ్మల, టెస్కాబ్ ఎండీ దృష్టికి తీసుకెళ్లిన పాలకవర్గం

7

పుస్తకాలొచ్చాయ్

- రెండు విడతల్లో పాఠ్యపుస్తకాల సరఫరా
- మొదటి విడతలో జిల్లాకు చేరిన 2,18,930 పుస్తకాలు
- ఇంకా రావాల్సినవి 4,65,810

7



సెల్ మోహనరంగ

- విచ్చలవిడిగా సెల్‌ఫోన్ వినియోగం
- అస్తమానం ఎల్ఈడీ తెరలు చూడడంతో అనర్థం
- చిన్నారుల్లో పెరుగుతున్న కంటి సమస్యలు

6

బతుకుబండి సాగేదెలా..

- లోకల్ లారీలకు దక్కని బొగ్గు లోడింగ్
- కష్టాల్లో లారీ యజమానులు
- సింగరేణి అధికారుల తీరుపై నిరసన
- సత్తుపల్లిలో కొనసాగుతున్న ఆందోళనలు

7

ఓటర్ స్లిప్పుల పంపిణీ

నూరుశాతం పూర్తవ్వాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై కలెక్టర్ ఆదేశం
- అధికారులతో గౌతమ్ సమీక్ష

7



స్వర్ణభద్ర కవచంతో భద్రాద్రి రామయ్య

భద్రాచలం, మే 17: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారు స్వర్ణభద్రకవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

సెల్ మోహనరంగ



- విచ్చలవిడిగా సెల్‌ఫోన్ వినియోగం
- అస్తమానం ఎల్‌ఈడీ తెరలు చూడటంతో అనర్థం
- చిన్నారుల్లో పెరుగుతున్న కంటి సమస్యలు

ఖమ్మం కలెక్టరేట్, మే 17: ఒకప్పుడు చందమామ రావే.. జాబిల్లి రావే అంటూ కన్నతల్లి తన చిన్నారికి చందమామను చూపిస్తూ గోరు ముద్దలు తినిపించేది. ఆధునిక కన్నతల్లి ఇప్పుడు చిన్నారులు మారాం చేస్తుంటే సెల్‌ఫోన్ చేతికి ఇచ్చేసి పాటలు.. కార్టూన్ కథలను వినిపిస్తున్నారు. ఈ తరహాలో బాల్యంలోనే చిన్నారులను ఓదార్చలేని తల్లి సెల్‌కు బానిసను చేస్తున్నారు.

ఇటీవల ఆర్‌బీఎస్కే స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాం కింద 5 నుంచి 8వ తరగతి పిల్లలు 4,567 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా కనీసం 1,053 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు.

కరోనా నేపథ్యంలో అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు డిజిటల్ తరగతుల విధానాన్ని అమలు చేశారు. ఇళ్లలో ఉండే సెల్‌ఫోన్ల ద్వారా పాఠాలు బోధించడంతో దాదాపు 70శాతం మంది విద్యార్థులు సెల్‌ఫోన్లకు అంకితం అయ్యారు. ఆ తర్వాత అవసరం లేకపోయినా సెల్‌కు అలవాటు పడిపోయారు. ఇలా దాదాపు కంటి సమస్యలతో బాధపడే చిన్నారులు కంప్యూటర్లు, ఫోన్లు ఎక్కువగా వాడుతుండడంతోనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇలాంటి సంఘటనలు ప్రస్తుత సమాజంలో నెలకొన్న పరిస్థితిని చాటిచెపుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్ ఫోన్ వినియోగం పెరిగింది. దీనికి తోడు కంప్యూటర్ ల్యాప్‌టాప్‌ల వినియోగం ఎక్కువ కావడంతో చాలా మంది తమకు తెలియకుండానే నేత్ర సంబంధిత అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. విద్యార్థి దశ నుంచే ఇది మొదలవుతుండడంతో రోజులు గడిచిన కొద్దీ సమస్య మరింత జఠిలంగా మారుతోంది.

ఎల్‌ఈడీ స్క్రీన్లతో....!

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అందరికీ స్మార్ట్ ఫోన్ వినియోగం తప్పనిసరైంది. కరోనా లాంటి విపత్కర సమయంలో వర్క్ ఫ్రం హోం, డిజిటల్ తరగతులకు ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితంగా విద్యార్థులు, యువత, ఉద్యోగులు అంతా ఫోన్ ల్యాప్‌టాప్ కంప్యూటర్లు, టీవీలకు మరింత దగ్గరయ్యారు. అవసరంగా ఉన్న ఈ స్మార్ట్ ఫోన్ వినియోగం ఇప్పుడు దాదాపు అందరికీ ఒక అలవాటుగా మారిపోయింది. స్మార్ట్ ఫోన్‌ను వీడి ఉండలేని పరిస్థితి నెలకొంది. సినిమా చూడాలన్నా పాటలు వినాలన్నా ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ చెల్లింపులు, ఉద్యోగ బాధ్యతల నిర్వహణ విద్యార్థులు తరగతులు వినడం సందేహాల నివృత్తి ఆటలు, ఇలా ఒకటేమిటీ అనేక రకాల పనులను కూర్చున్న చోటు నుంచి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను ఉపయోగించి పూర్తి చేస్తున్నారు. మొదట్లో సరదాగా ఆనందంగా ఉన్నా క్రమేణా ఈ అలవాటు పలు అనారోగ్య సమస్యలకు కారణం అవుతోంది. దీంతో కంటి సమస్యలు అధికం అవుతున్నాయి. అంతే కాదు రాత్రి వేళల్లో కూడా విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దలు అధికంగా స్మార్ట్ ఫోన్‌ను వినియోగించడం చీకట్లోనూ సెల్ స్క్రీన్లను చూడడం వలన కంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో కంటి సమస్యలతో పాటు దీనికి అనుసంధానంగా మైగ్రేన్ తలనొప్పి, వాంతులు, రాత్రిళ్లు నిద్ర పోకపోవడం లాంటి దుష్పరిణామాలు కలుగుతున్నాయి. ఫలితంగా మరుసటి రోజు భోజనం సహించక పోవడం తద్వారా రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని నియంత్రించకుంటే మరిన్ని దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




కళ్లు పొడిబారే ప్రమాదం ఉంది



డాక్టర్ రాము నాయక్, కంటి వైద్యనిపుణులు

పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్ వినియోగించడం అధికం అవుతోంది. ఫలితంగా చిన్నారుల కళ్లు పొడిబారి పోతున్నాయి. స్మార్ట్ ఫోన్ వినియోగించే వారు గాలి వెలుతురు ఉన్న ప్రదేశంలోనే స్మార్ట్ ఫోన్ డిస్‌ప్లే లైటింగ్ తగ్గించి వినియోగించాలి. ప్రతి 20 నిమిషాలకు ఒ మారు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులపై కనీసం 20 సెకన్ల పాటు దృష్టిని మరల్చి చూడాలి. దీంతో కంటి కండరాలకు ఉపశమనం కలుగుతుంది. నిమిషానికి కనీసం పదిసార్లైనా కనురెప్పలను ఆర్పడం అలవాటు చేసుకోవాలి. ఫలితంగా కళ్లు పొడిబారకుండా ఉంటాయి. విటమిన్ ఏ సంబంధిత క్యారెట్లు, బొప్పాయి , ఆకుకూరలు, ఉడకబెట్టిన గుడ్లు, చేపలు ఆహారంలో తీసుకోవాలి. తప్పనిసరిగా స్మార్ట్ ఫోన్‌ను వినియోగించాల్సి వస్తే యాంటీ గ్లేర్ కళ్లద్దాలు వినియోగించాలి.

దుష్పరిణామాలు అధికమే...!



డాక్టర్ కంభంపాటి నారాయణరావు, సైక్రియాటిస్ట్

అదే పనిగా సెల్‌ఫోన్, టీవీలు, కంప్యూటర్ స్క్రీన్లు చూడడం వలన కళ్లు అలసిపోయి తడారిపోతాయి. బ్లూలైట్ కాంతి కారణంగా కళ్లు పొడిబారుతాయి. దీని వలన కంటి రెప్పలు వాపు కళ్లలో దురద, మంట, నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. దీనిని వైద్య బాషలో కంప్యూటర్ వీనస్ సిండ్రోమ్, లేదా డిజిటల్ కంటి ఒత్తిడిగా అంటారు. ఆదిలోనే గుర్తించి జాగ్రత్త పడితే కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. లేక పోతే హ్రస్వ దృష్టి వంటి లోపానికి గురయ్యే అవకాశం ఉంటుంది. రాను రాను జ్ఞాపక శక్తిని కోల్పోవాల్సి వస్తుంది.

డిజిటల్ విధానం విద్యార్థులకు ఇబ్బందికరమే



తుమ్మల భాగ్యమ్మ, ఉపాధ్యాయురాలు

అవసరం మేరకు మాత్రమే డిజిటల్ తరగతుల విధానాన్ని వినియోగించుకోవాలి. కానీ అదే అంతిమ పరిష్కారం కాకూడదు. వీలైనంత వరకు విద్యార్థులకు ప్రత్యక్ష బోధన ఉండేలా చూడాలి. దీని వలన విద్యార్థులు సులువుగా నేర్చుకోగలుగుతారు. ప్రయోగాలు, క్షేత్రస్థాయి సందర్శనలతో సందేహాలను నివృత్తి చేసుకోగలుగుతారు. ఇతర విద్యార్థులతో కలిసి మెలిసి ఉండడం వలన భావ వక్తీకరణ మెరుగవుతుంది. పోటీ ప్రపంచంలో ఏలా రాణించాలో సమస్యలను ఎలా ఎదుర్కొనాలో అర్థం చేసుకోగలుగుతారు.

చిన్నతనంలోనే వ్యసనంగా మారుతోంది



చెన్న దుర్గాప్రసాద్, ఖమ్మం

చిన్నతనంలోనే సెల్‌ఫోన్ వ్యసనంగా మారుతోంది. తల్లిదండ్రులు కూడా చిన్నారులు మారాం చేస్తే సెల్‌ఫోన్ చేతికి ఇచ్చి ఊరుకుండబెడుతున్నారు. ఇది సరైంది కాదు. కరోనా నేపథ్యంలో విద్యార్థులకు డిజిటల్ తరగతుల పేరుతో స్మార్ట్ ఫోన్ పలు ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు బోధిస్తుండటం ఇబ్బందిగా ఉంది. సెల్‌ఫోన్లకు అలవాటు పడిన విద్యార్థులు చిన్నారులు అది లేకుండా ఉండలేని పరిస్థితి ఉంది. ఈ విధానానికి స్వస్తి పలకాలి. అధికంగా పాఠశాల యాజమాన్యాలు తరగతి గది బోధనకే ప్రాధాన్యం ఇవ్వాలి. స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు కూడా ఒక కన్నేసి ఉంచాలి. లేకుంటే దాన్ని ఇతర కార్యకలాపాలకు అలవాటు పడే ప్రమాదం కూడా ఉంది.

'బీపీఎస్' ఉచిత విద్యకు దరఖాస్తులు

- భద్రాద్రి జిలా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య

చుంచుపల్లి, మే17: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం(బీఏఎస్) కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య శుక్రవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరములలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద రెసిడెన్షియల్ (వసతి గృహ) 5వ తరగతిలో (69) సీట్లు), నాన్ రెసిడెన్షియల్ (డే స్కాలర్స్) 1వ తరగతిలో (66సీట్లు) ప్రవేశం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 135 సీట్లు ఎస్సీ విద్యార్థులకు మంజూరు అయినట్లు తెలిపారు.

1. సెయింట్ జోసెఫ్ హైస్కూల్, రుద్రంపూర్, చుంచుపల్లి మండలంలో 22 సీట్లు (1వ తరగతిలో నాన్ రెసిడెన్షియల్ (డే స్కాలర్స్), 2. స్వర్ణ భారతి హైస్కూల్, కొత్తగూడెం 22 సీట్లు (1వ తరగతిలో నాన్ రెసిడెన్షియల్ (డే స్కాలర్స్), 3. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ , భద్రాచలం-22 సీట్లు (1వ తరగతిలో నాన్ రెసిడెన్షియల్(డేస్కాలర్స్), 4. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, భద్రాచలం- 69 సీట్లు(5వ తరగతిలో రెసిడెన్షియల్ (వసతి గృహం)

అర్హతలు.. కుటుంబములో ఒక విద్యార్థి మాత్రమే ఈ పథకంలో అర్హులు. తల్లి దండ్రుల వారిఆదాయం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలకు చెందిన వారికి రూ.2 లక్షలు మించరాదు. జిల్లాకు చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులు. దరఖాస్తులను వచ్చే నెల 7వ తేదీ లోపు అందజేయాలి. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 11వ తేదీన ఉదయం 11 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) పాల్వంచలో జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేస్తారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న జడ్సన్

తీన్మార్ మల్లన్నను అనర్హుడిగా ప్రకటించాలి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సభలో పట్టభద్ర ఓటర్లను బ్లాక్‌మెయిల్
- కలెక్టరేట్ ఎదుట స్వతంత్ర అభ్యర్థి జడ్సన్ నిరసన

ఖమ్మం కలెక్టరేట్, మే 17: గ్రాడ్యుయేట్ ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసిన తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని లేకుంటే నిరసన దీక్ష చేస్తానంటూ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆయన ఆందోళన నిర్వహించారు. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సభలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 4.61 లక్షల గ్రాడ్యుయేట్ ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేసినట్టు ఆరోపించారు. తనను శాసనమండలికి పంపుతారా లేకుంటే శ్మశానానికి పంపుతారా ? అని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేశారని వాయిస్ రికార్డింగ్‌తో సహా ఆయన వినిపిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీనిపై తాను కేంద్ర ఎన్నికల సంఘానికి మెయిల్ ద్వారా, రాష్ట్ర ఎన్నికల అధికారికి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ రాహుల్ బొజ్జకి, నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో అడిషనల్ రిటర్నింగ్ ఆఫీసర్ కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కానీ ఆయనపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరాహార దీక్ష ప్రారంభించినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల జడ్సన్ దీక్షను అడ్డుకున్నారు. ఆ తర్వాత అడిషనల్ రిటర్నింగ్ ఆఫీసర్ మధుసూదన్ నాయక్‌కు వచ్చి జడ్సన్‌కు వివరణ ఇచ్చారు. ఆరోపణలపై అధికారులకు తన ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోకుంటే శనివారం నల్గొండ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపడతానని జడ్సన్ తెలిపారు.



జడ్పీ ప్రాంగణంలో బ్యాలెట్ బాక్సులను దించుతున్న దృశ్యం

'ఎమ్మెల్సీ' బ్యాలెట్ బాక్సుల రవాణాకు కార్యాచరణ

ఖమ్మం కలెక్టరేట్, మే 17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోసం వినియోగించనున్న బ్యాలెట్ బాక్సుల రవాణాకు కార్యాచరణ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ జడ్పీ ఆవరణలోని స్ట్రాంగ్ రూం లో భద్రపరచిన బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్‌కు, పోలింగ్ అనంతరం నల్గొండలోని రిసిప్షన్ కేంద్రానికి సిబ్బంది, పోలింగ్ సామగ్రితో వెళ్లేందుకు రవాణాకు కార్యాచరణ చేయాలన్నారు. టీఎస్ ఆర్టీసీ బస్సులో రూట్ల వారిగా సిబ్బంది, బాక్సులు, బస్సుల ప్రణాళిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, ఖమ్మం ఎంపీవ వెంకటరమణ, ఖమ్మం డిపోమేనేజర్ శ్రీనివాసరావు, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- లబోదిబోమంటున్న రైతులు
- నష్టపరిహారం అందించాలని వేడుకోలు

కరకగూడెం/ మణుగూరుటౌన్, మే 17: రైతులు ఆరుగాళం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన దశలో అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. రైతులు రెండో పంటగా ధాన్యం పంటను సాగు చేశారు. మండల వ్యాప్తంగా 3వేల వరి పంట, పలు కంపీణీ రకాల ధాన్యం సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు ధాన్యం పంటను సాగు చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 30 శాతం మంది రైతులు ధాన్యం పంట కోతలు కోసి కొందరు రైతులు, కోతలకు వచ్చి కొందరు రైతులు ఉన్నారు. మండలంలోని అనంతారం, కరకగూడెం, పద్మాపురం, మోతే, గొళ్లగూడెం, చొప్పాల, చిరుమళ్ళ, వెంకటాపురం గ్రామాలలో రైతులు తమ వరిని కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆర పోశారు. గురువారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో ధాన్యం తడిశాయి. శుక్రవారం రైతులు తడిసిన ధాన్యం ఆరబోశారు. ఇంకా వర్షాలు ఉన్నాయని వాతవరణ శాఖ తెలపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తడిసిన ధాన్యం త్వరగతి కొనుగోలు చేయాలని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

మణుగూరు మండలంలో వర్షం దోబూచులాడింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన వర్షానికి ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడింది. సాంబయిగూడెం, రామానుజవరం పంచాయతీల పరిధిలోని మారు మూల గ్రామాల రైతులు కొంత ఇబ్బందికి గురయ్యారని తెలిసింది. కళ్లాల్లోని ధాన్యం తడిసినట్లు చెబుతున్నారు.



కరకగూడెంలో తడిసిన ధాన్యం



మణుగూరులో వర్షం కురుస్తున్న దృశ్యం



ధాన్యం తడిసి పోయింది
కొత్తపల్లి రామచంద్రు, పద్మాపురం రైతు

వేల రూపాయాల పెట్టబడి పెట్టి పండించిన పంట చేతికి అందిన దశలో అకాల వర్షంతో ధాన్యం తడిసి పోయాయి. తడిసిన ధాన్యంను ఆర పోస్తున్నాము. మరల వర్షం పడితే ధాన్యం పూర్తిగా పాడైపోతుంది. అధికారులు స్పందించిన ధాన్యం త్వరగతిన కొనుగోలు చేయాలి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

పరిహారం అందజేయాలి
మహ్మద్ అక్తర్ పాషా, పద్మాపురం రైతు



ఎకరాకు 20 వేల పైన పెట్టుబడులు పెట్టాము. అకాల వర్షాల వలన ధాన్యం గింజలు రాలాయి. పంట కొచ్చిన పంటను కోసిన సరైన ధాన్యం కాలేదు. ఎకరాకు 30, 35 బస్తాలు కావల్సి.. అకాల వర్షాల వలన ఎకరాకు 10 నుంచి 13 బస్తాలు కావడం కష్టంగానే ఉంది. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి

- కాంగ్రెస్ ప్రజాసమస్యలు గాలికొదిలేసింది
- ఆరు గ్యారంటీల అమల్లో విఫలం
- మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

ఖమ్మం బైపాస్‌రోడ్, మే17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించి అభివృద్ధి చేసేందుకు సహకరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీసే శక్తి బీజేపీకే ఉందని, బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి చూసి బీజేపీపై ప్రజల్లో మంచి స్పందన ఉందని, వరంగల్‌కు చెందిన ప్రేమేందర్‌రెడ్డి ప్రజాసమస్యలపై పోరాడే వ్యక్తి అని, జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన గెలవబోతున్నారని అన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని పడగొట్టే అవసరం తమకు లేదని అన్నారు. పడగొట్టడానికి ఖమ్మం, నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు పార్టీలు జీరోగా ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారంలో కోడిగుడ్డుపట్టుకుని తిరిగాడని అది కమ్యూనిస్టులకు వర్తిస్తుందని అన్నారు. ఖమ్మంలో ఉన్న కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయారని, ఇది వాస్తవమన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి 40వేల ఓట్లు వచ్చాయని, ఇప్పుడు బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చి గెలవబోతుందన్నారు. కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 5వివీన గ్రామపంచాయతీలను కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని ప్రేమేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి అరచేతిలో వైకుంఠం చూపించి ఇప్పుడు సన్నబియ్యం పండించిన రైతులకే రూ.500లు బోనస్ ఇస్తామని మాటలు మారుస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు, రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు, విద్యాసాగర్‌రావు, మంద సరస్వతి, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కిరణ్, శ్యామ్‌రాథోడ్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీకి మద్దతు

- టీడీపీ నాయకుడు కేతినేని హరీష్ చంద్ర

ఖమ్మం మామిళ్లగూడెం, మే 17: ఖమ్మం, నల్గొండ, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో టీడీపీ బీజేపీ అభ్యర్థికి మద్దతునిస్తుందని టీడీపీ పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ తెలిపారు. శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమిందర్ రెడ్డి నాయకులతో కలిసి ఖమ్మం తెలుగు దేశం పార్టీ ఆఫీస్‌కి వచ్చి మద్దతు కోరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో హరీష్ చంద్ర మాట్లాడుతూ మే 13న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తమ పార్టీ మద్దతును కూటమి అభ్యర్థిగా బీజేపీకి ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పార్లమెంట్ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం ఆదేశాల మేరకు బీజేపీ అభ్యర్థికి ఇస్తున్నట్లు ప్రకటించారు. తొలుత టీడీపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఎన్టీఆర్ కి భారతరత్న ఇవ్వాలి అనిడిమాండ్ చేస్తూ కేతినేని హరీష్ గత మూడు నెలలుగా చేపట్టిన పోస్ట్ కార్డు ఉద్యమం లో బీజేపీ నాయకులు సంతకాలు చేసి మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెంపాటి అప్పారావు, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు మీగడ రామారావు, బోయిన వెంకన్న, చింతనిప్పు నాగేశ్వరావు, కన్నేటి పృథ్వి, బైరు అప్పారావు, నాగండ్ల లక్ష్మణ్, ఎస్కే మీరా, జానిమియా తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బీఆర్ఎస్ పార్టీకి షాక్.. కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్

- కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కోరం

కామేపల్లి, మే 17: బీఆర్ఎస్ పార్టీకి మరోసారి షాక్ తగిలింది. గరిడేపల్లి మాజీ సర్పంచ్ బోడా రాంజీ నాయక్ బీఆర్ఎస్ పార్టీని వీడారు. శుక్రవారం పాతలింగాలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు ఆకర్షితులై చేరుతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు పేదలకు అందుతున్నాయని, ఆగస్టు 15 నాటికి ప్రకారం రైతు రుణమాఫీ చేస్తారని అన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గింజల నర్సింహరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, మల్లిబాబు, గోపిరెడ్డి, అనురాధ, బోడా రాజేష్, గోపి, బట్టు నాను, వేణు, ఉపేందర్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్స్ పోరులో బీఆర్ఎస్‌కే పట్టం

- నిరుద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్‌పై వ్యతిరేకతతో ఉన్నారు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి

ఖమ్మం, మే17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్టబోతున్నారని, ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగులు రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఉన్నత విద్యావంతుడని, ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, పల్లా రాజేశ్వరరెడ్డి వంటి ప్రముఖులు శాసనమండలికి ప్రాతినిధ్యం వహించారని, అదే స్ఫూర్తితో విద్యావంతుడైన, నిబద్ధత కలిగిన రాకేష్‌రెడ్డి శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు ఓటేసి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ గెలుపు ద్వారానే శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, వారు ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలుచేయించేందుకు పోరాడే అవకాశం లభిస్తుందని తెలిపారు.

అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ తరుపున తాను పోటీలో ఉన్నానని, నిరుద్యోగులు, పట్టబద్రులు, ఉద్యోగులు, న్యాయవాదులు, ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న పట్టభద్రులు ఓటువేసి గెలిపించాలన్నారు. తాను ఒక రైతు బిడ్డనని, పట్టభద్రుల్లో ఎక్కుశాతం రైతుల బిడ్డలే ఉన్నారని, రైతులసమస్యను శాసనమండలిలో నిలదీసే సత్తా బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు. రైతులసంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తన గెలుపు ద్వారా ఎత్తిచూపుతానని, రైతుల సమస్యలపై పోరాడతానని తెలిపారు శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం పెరిగితేన కాంగ్రెస్ ప్రభుత్వంపై పటిష్ఠంగా పోరాటం సాగించవచ్చని తెలిపారు. ఈసందర్భంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను జిల్లా అధ్యక్షుడు తాతా మధు ప్రకటించారు. ఖమ్మానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ, పాలేరుకు తాళ్లూరి సృజన్‌కుమార్, సత్తుపల్లికి ఖమర్, మధిరకు బిచ్చాల తిరుమలరావు, వైరాకు లకావత్ గిరిబాబును ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. వీరితో పాటు పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్ డోకుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యం

» రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర » ఇల్లెందు, భద్రాచలంలో ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష


ఇల్లెందులో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఇల్లెందు/భద్రాచలం, మే 17: నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి ఈనెల 27న జరిగే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఇల్లెందు పట్టణంలో పర్యటించారు. సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్ గృహంలో ఎమ్మెల్సీ ఎన్నికల కమిటీ బాధ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ త్వరలో ఇల్లెందు రానున్నారని, పట్టభద్రులతో సమావేశం కానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, నాయకులు లక్కినేని సురేందర్‌రావు, ఖమ్మంపాటి రేణుక, పరచూరి వెంకటేశ్వర్లు, తాతా గణేష్, లక్ష్మణ్‌నాయక్, పాల్గొన్నారు.

నిరుద్యోగుల పక్షాన పోరాడే బీఆర్ఎస్‌కు ఓటేయండి

భద్రాచలం: విద్యావంతులు, మేధావులు ఆలోచించి ప్రజల పక్షాన నిరుద్యోగుల పక్షాన పోరాడే గొంతుకగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. భద్రాచలంలో శుక్రవారం నియోజవకర్గ పట్టభద్రుల సమావేశం నిర్వహించారు. రవిచంద్ర మాట్లాడుతూ పట్టభద్రులందరూ ఆలోచించి ప్రశ్నించే గొంతుక మీ ముందుకు వస్తున్న రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేసీఆర్ పాలనలో పదేళ్లు రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఏ ఒక్కరికి కష్టం వచ్చినా గులాబీ జెండా అండగా ఉందని మరోసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీజెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, బోదెబోయిన బుచ్చయ్య, దొడ్డి తాతారావు, తాండ్ర వెంకట రమణారావు, పెనుబల్లి రామకృష్ణారెడ్డి, గుపరాంబాబు, లంకరాజు, అన్నె సత్యాలు, కవిత, రాముడు, ఆకోజు సునీల్‌కుమార్, పడిసిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బతుకుబండి సాగేదెలా?

» లోకల్ లారీలకు దక్కని బొగ్గు లోడింగ్
» కష్టాల్లో లారీ యజమానులు
» సింగరేణి అధికారుల తీరుపై నిరసన
» సత్తుపల్లిలో కొనసాగుతున్న ఆందోళన

సత్తుపల్లి, మే 17: సత్తుపల్లి కేంద్రంగా ఉన్న లారీ యజమానులు స్థానిక బొగ్గు గనుల నుంచి లోడింగ్ రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు బొగ్గు లోడింగ్‌లో 40శాతం కేటాయించాలని సత్తుపల్లి లారీ అండ్ టిప్పర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. సింగరేణి అధికారులు నాణ్యమైన బొగ్గు లోడింగ్ ఇవ్వని కారణంగా బొగ్గు రవాణాకు కిరాయి సక్రమంగా దక్కటం లేదని అసోసియేషన్ బాధ్యులు ఆరోపిస్తున్నారు. మూడు రోజులుగా లారీ యజమానులు సత్తుపల్లిలో ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం ఆందోళనలో భాగంగా యూనియన్ ఆఫీసు వద్దనే వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు.

లారీ యజమానుల వాదన ఇదీ..

సత్తుపల్లి లారీ, టిప్పర్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలో 750 లారీలున్నాయి. వీరిలో సింగరేణి ఓపెన్ కాస్టుల్లో భూములు కోల్పోయిన వారు కూడా లారీలు కొనుక్కొని జీవనం సాగిస్తున్నారు. మరి కొందరు డ్రైవర్లు కూడా లారీలు కొనుగోలు చేసి స్వంతంగా నడుపుకుంటున్నారు. గతంలో సత్తుపల్లిలోని ఓపెన్ కాస్టుల నుంచి కొత్తగూడెం వరకూ బొగ్గు రవాణా జరిగేది. 2022లో రైల్వే లైను ప్రారంభమైన నాటి నుంచి బొగ్గు రోడ్డు రవాణా తగ్గింది. సిమెంట్, ఎరువులు, పేపర్ తయారీ, పాలు, తదితర ప్రైవేటు కంపెనీలకు బొగ్గు రవాణా సాగుతోంది. ప్రైవేటు కంపెనీలు స్థానికంగా కిష్టారం, జేవీఆర్ ఓసీలలో బొగ్గు కొనుగోలు చేస్తారు. కంపెనీలు కొనుగోలు చేసిన బొగ్గును స్థానిక లారీల్లో ఆయా కంపెనీలకు రవాణా చేస్తారు. కాని ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ప్రైవేటు కంపెనీలకు పంపిన బొగ్గు నాణ్యతగా ఉండటం లేదని లారీల నుంచి అన్‌లోడ్ చేసుకోవటం లేదని, దీని వల్ల తాము నష్టపోతున్నామని లారీ యజమానులు చెపుతున్నారు. నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోటంతో సదరు కంపెనీలో ఇతర ప్రాంతాల్లో బొగ్గు కొనుగోలు చేస్తున్నారని అసోసియేషన్ బాధ్యులు ఆరోపిస్తుండగా నాణ్యమైన బొగ్గు ఇస్తున్నామని, నాణ్యత లేదంటూ ఏ ఒక్క కంపెనీ కూడా ఇంత వరకూ తమకు ఫిర్యాదు చేయలేదని సింగరేణి అధికారులు చెపుతున్నారు. మరో పక్క స్థానిక ఓపెన్ కాస్టుల్లో నిల్వ ఉన్న బొగ్గును ఆర్‌సీహెచ్‌పీ (రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)కి తరలించే కాంట్రాక్టు రద్దు చేసి స్థానిక లారీకే నాణ్యమైన బొగ్గు లోడింగ్ ఇవ్వాలని గురవారం కొత్తగూడెం సింగరేణి జనరల్ మేనేజర్ షాలేం రాజును లారీ యజమానులు కుటుంబ సభ్యులతో సహా కలసి విన్నవించారు. నాణ్యమైన బొగ్గు లోడింగ్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని, ఆర్‌సీహెచ్‌పీకి రవాణా నిలిపివేయటం తమ పరిధిలో లేదని స్పష్టం చేశారు. కంపెనీలు ముందుకు వస్తే బొగ్గు కేటాయిస్తామన్నారు. సమస్య పరిష్కారం కాకపోవటంతో శుక్రవారం కూడా లారీ యజమానుల ఆందోళన కొనసాగింది. యూనియన్ కార్యాలయం వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. యజమానులు, అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ ఒక్కో లారీకి ఫైనాన్స్ కిస్తీ సగటును రూ.70వేలు చెల్లించాల్సి ఉందని, ఇది కాక లారీ కిరాయి ఉన్నా లేకున్నా పన్నుల రూపంలో మరో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ చెల్లించాల్సి ఉందన్నారు. అయినా నాలుగు రోజులుగా లారీలు నిలిపివేసి ఆందోళన నిర్వహిస్తున్నామని చెప్పారు. స్థానిక లారీలకు 40శాతం నాణ్యమైన బొగ్గు లోడింగ్ ఇవ్వాలని అప్పటి వరకూ తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. శుక్రవారం జరిగిన ఆందోళనలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి రమేష్ రెడ్డి, పీఎల్. ప్రసాద్, కోటిరెడ్డి, కీజర్, నజీర్, కోట మోహనరావు, సూరి బాబు, దాసు, మధు, శ్రీనివాస్, అన్వర్, రెహ్మాన్ పాల్గొన్నారు.


కిష్టారం ఓసీ వద్ద లారీ యజమానుల ఆందోళన

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం ఐడీవోసీలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్3 వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండ అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రాద్రి జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, నిర్ణీత తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు ముందునే చేరుకోవాలని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండ కేంద్రాల సమీపంలో ఉన్నటువంటి జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆయన ఆదేశించారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 5408 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2,726మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచన రాణి, జిల్లా వైద్యశాఖ అధికారి శిరీష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ అనుమతులను పరిశీలించిన డీఎఫ్‌వో

దుమ్ముగూడెం మే 17: మండల పరిధి పైడిగూడెం-కొత్తూరు, ముల్కనాపల్లి-ఆర్లపెంట, కుర్నపల్లి-నిమ్మలగూడ రహదారుల నిర్మాణ అనుమతుల స్థితిగతులను డీఎఫ్ఓ కృష్ణగౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఎంత మేర విస్తీర్ణంలో రిజర్వ్‌ఫారెస్టు, రెవెన్యూశాఖల పరిధిలో రహదారి నిర్మాణం జరగనుందనే అంశాలను పరిశీలించారు. సదరు రహదారుల నిర్మాణాల కోసం ఆర్అండ్‌బీ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రిజర్వ్‌ఫారెస్టులో రహదారుల నిర్మాణం జరగనున్న దృష్ట్యా అటవీశాఖ అనుమతి కావాల్సి ఉంది. దీంతో ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్‌తో కలిసి డీఎఫ్ఓ పరిశీలించారు. రేంజి అధికారి పాయం కనకమ్మ, రేంజి సిబ్బంది ఉన్నారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయాధికారి

ఖమ్మం లీగల్, మే 17: న్యాయసేవాసంస్థ కార్యకలాపాలలో భాగంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.వి.చంద్రశేఖర్‌రావు జిల్లా జైలును సందర్శించారు. జైలులోని పలు కేసులలో విచారణ ముద్దాయిలతో మాట్లాడి కేసు వివరాలు, వాయిదా తేదీలు, కేసులో జాప్యం, కుటుంబ సభ్యుల వివరాలు, ఆరోగ్య సమస్యలు మరియు మౌలిక వసతుల సదుపాయాలు, అప్పీలు సంబంధిత అంశాలలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సందర్శనలో భాగంగా న్యాయాధికారి మాట్లాడుతూ జైలులో ఉన్న ఖైదీలకు న్యాయసేవాధికారసంస్థ తరపున ఉచితంగా న్యాయసహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఏ.శ్రీధర్ పాల్గొన్నారు.

బిల్డింగ్ పై నుండి పడి వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం మే 17: బిల్డింగ్ పై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అగ్రహారం కాలనీకి చెందిన పాయం వీరస్వామి(48) అను వ్యక్తి సుతారి పనిచేసేందుకు ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని ఓ ఇంటి వద్దకు వచ్చాడు. ఇంటి పైన మూడో ఫ్లోర్లో సిమెంట్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

డీసీసీబీలో బదిలీల వివాదం

» ఎన్నికల కోడ్ సమయంలో భారీగా బదిలీలు » పాలకవర్గానికి తెలియకుండానే సీఈవో చర్యలు ? » మంత్రి తుమ్మల, టెస్కాబ్ ఎండీ దృష్టికి తీసుకెళ్లిన పాలకవర్గం

ఖమ్మం వ్యవసాయం, మే 17: ఖమ్మం జిల్లా కేంద్రసహకార బ్యాంక్‌లో బదిలీల వ్యవహారం వివాదాస్పదమైంది. అధ్యక్షుడితోపాటు పాలకవర్గానికి కనీస సమాచారం లేకుండా సీఈవో ఈ బదిలీలు చేశారని పాలకవర్గం సభ్యులు వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రెండురోజుల క్రితం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో 30మంది మేనేజర్లు, 90 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు బదిలీలు జరిగాయి. అయితే పాలకవర్గానికి, అధ్యక్షుడికి కనీస సమాచారం ఇవ్వకుండానే సీఈవో ఈ బదిలీలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ బదిలీల వ్యవహారం వివాదాస్పదమైంది. మరోవైపు ఈ బదిలీల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొందరు పాలకవర్గ సభ్యులతో కలిసి శుక్రవారం వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టెస్కాబ్ ఎండీ మురళీధర్‌రావులను కలిసి జరిగిన బదిలీల అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మరోవైపు తమకు తెలియకుండా జరిగిన ఈ బదిలీల వ్యవహారంలో సీఈవో వెనుక ఎవరు ఉన్నారో తేలాల్సి ఉందని కొందరు పాలకవర్గం సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు డీసీసీబీ సీఈవోను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

బాలల హక్కులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

» భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక


సమీక్ష నిర్వహిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. బాలల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాలల చట్టాల అమలు వంటి అంశాల్లో తీసుకుంటున్న చర్యలపై జిల్లా సంక్షేమ, మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో డిస్ట్రిక్‌చైల్డ్ ప్రొటెక్షన్ కమిటి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాల బాలల సంరక్షణ కేంద్రాల ద్వార బాలలకు రక్షణ కల్పించామన్నారు. వీరికి పూర్తిస్థాయిలో సంరక్షణ అందించి ప్రయోజనాలను చేసేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. బాలల భద్రత శ్రేయస్సుకు సంబంధించి ప్రభావితం చేసే సమస్యలపై కమిటి దృష్టి పెట్టాన్నారు. ఈ సమావేశంలో డీఆర్వీవో విద్యాచందన, డీడబ్ల్యువో విజేత, ఎస్సీ సంక్షేమ అధికారి అనసూ, బీసీ సంక్షేమ అదికారిఇందిరా, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీరావు, అసిస్టెంట్ టేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్, సంక్షేమ సమితి సభ్యులు, పోలీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత: సీపీ

ఖమ్మం రూరల్, మే 17: ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిదిలోని పొన్నేకల్లు పరిదిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్స్ నలువైపులా కేంద్ర పోలీస్ బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతతో పాటు నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో పటిష్టమైన రక్షణ వుందని సీపీ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకూ తావు లేకుండా పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

తుమ్మలను కలిసిన తీన్మార్ మల్లన్న



ఖమ్మం సంక్షేమవిభాగం, మే 17: రాష్ట్ర వ్యవసా యశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రె స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లన్న కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన మల్లన్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై చర్చించారు. అలాగే డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం ము న్సిపల్ చైర్మన్ పునకొల్లు నీరజ, రైతు సంఘం నాయకులు నలవమల వెంకటేశ్వర్లు తుమ్మలను కలిసిన వారిలో ఉన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ నూరుశాతం పూర్తవ్వాలి

» అధికారులతో ఖమ్మం కలెక్టర్ గౌతమ్ సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం ఆర్డీవోలు, తహసీల్దార్లతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ, ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్‌కు, తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియాల్సిన అవసరం ఉన్నందున ప్రతిఒక్క ఓటర్‌కు పోల్ స్లిప్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్లిప్పుల పంపిణీని సంబంధిత బీఎల్‌వో ద్వారా చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి విడత శిక్షణ 20న, రెండో విడత శిక్షణ 26న చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది 26న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకొని, సంబంధిత పోలింగ్ కేంద్రానికి వెళ్లి అక్కడే బస చేయాలన్నారు. రిషష్షన్ కేంద్రం నల్లగొండలోని నాగార్జున కళాశాలలో ఉంటుందని, 27న పోలింగ్ తర్వాత నేరుగా రిషష్షన్ కేంద్రానికి పోలీస్ ఎస్కార్ట్‌తో బ్యాలెట్ బాక్సులను తరలించాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులంతా శుక్రవారం నుంచే విధులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్, ఆర్డీవోలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతించవద్దని కలెక్టర్ సూచించారు.

● ఇక ధరణి పెండింగ్ దరఖాస్తులపై కూడా కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. ప్రతిరోజు తహసీల్దార్ కనీసం 20 ఫైళ్ల సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్లలో పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, డీఆర్డీవో ఎం. రాజేశ్వరి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, అనురాధబాయి, రాంబాబు, సత్యనారాయణ, ఓఎస్డీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సోకేసులో 20ఏళ్ల జైలు

కొత్తగూడెం, లీగల్, మే 17: పోక్సోకేసులో ఓ వ్యక్తికి 20 సంవత్సరాల కఠినకారాగార శిక్ష విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాధితురాలు తనకు పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉండగా ఆమె తల్లిదండ్రులు ఖమ్మం నుంచి అశ్వాపురం మండలంలోని తన అమ్మమ్మ నివాసం ఉంటున్న మంచికంటినగర్‌లో నాటువైద్యం చేయించేనిమిత్తం వదిలివెళ్లారు. ఈ విధంగా వైద్యం చేయించుకున్న బాధితురాలిని ఇంటి సమీపంలో ఉన్న జవ్వాజి సాంబశివరావు 2021 డిసెంబరు 30న ఒంటరిగా ఉన్నమహిళ బాలికను తన ఇంట్లో టీవీ చూపిస్తానని నెపంతో తన ఇంట్లోకి బలవంతంగా తీసుకెళ్లి అఘయిత్యానికి పాల్పడ్డాడని ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. బాలిక కేకలు వేయగా వదిలిపెట్టి బయటకు పరారయ్యాడు. తనకు జరిగిన విషయాన్ని కూలి పని నుంచి ఇంటికి వచ్చిన అమ్మమ్మకు జరిగిన విషయాన్ని ఏడుస్తూ బాధితురాలు చెప్పింది. అమ్మాయి తల్లిదండ్రులకు తెలియచేసి మరుసటి రోజు అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ కేసు నమోదు చేసికు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. 12మంది సాక్షుల విచారణ అనంతరం సాంబశివరావుపై నేరం రుజువుకావడంతో 20 సంవత్సరాలు కఠినగార శిక్ష, రూ.5వేల జరిమాన విధిస్తూ బాధితురాలికి పునరావాస పరిహారం కింద రూ.5లక్షలు చెల్లించేవిధంగా జిల్లా న్యాయసేవాఅధికారసంస్థను ఆదేశించారు. స్పెషల్ పబ్లిక్ ప్రసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించగా లైజన్ ఆఫీసర్ ఎం. హరిగోపాల్ కోర్టు డ్యూటి ఆఫీసర్ పీ.సి. మాలోత్ ఈశ్వర్ సహకరించారు.

అప్పుల బాధలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు, మే 17: అప్పుల బాధలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి ముసలిమడుగులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన ఉల్లోజు హరీష్(27) లారీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 8నెలల క్రితం ఓ లారీని కొనుగోలు చేసిన హరీష్ కిరాయిలు లేకపోవడంతో ఫైనాన్స్ చెల్లించడం భారంగా మారినట్లు తెలిపారు. దీంతో అప్పులు బాధలు తాళలేక మనస్థాపం చెంది గురువారం రాత్రి సమయంలో తన ఇంటిలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీశారు. మృతుడికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం మృతుడి అన్నయ్య నరేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహనికి బూర్గంపాడు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

జూలూరుపాడు, మే 17: మండలంలోని మాచినేనిపేటతండా గ్రామానికి చెందిన బాణోత్ సంధ్య 26 సంవత్సరాలు అనే వివాహిత అదృశ్యమైన సంఘటనపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం ఎస్ఐ జీవన్‌రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంధ్య ఈ నెల 11న రాత్రి భర్త రవితో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినప్పటికి ఆచూకి లభించలేదు. సంధ్య తండ్రి గుగులోత్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె ఆచూకి తెలిసిన వారు సెల్ నెంబర్లు 8712682041, 8712682042 లకు సమాచారాన్ని అందిచాలని కోరారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నం

ఖమ్మం క్రైం మే 17: ఖమ్మం నగరంలోని మమత రోడ్‌లోని నివసించే ఓ వృద్ధురాలు మెడలో గుర్తుతెలియని వ్యక్తి బంగారు గొలుసును చోరీచేసేందుకు గురువారం సాయంత్రం యత్నించాడు. గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా మహిళ మెడలో గొలుసు లాగటంతో ఆమె కిందపడింది. దీంతో ఆమెకు తలకు తీవ్రగాయం అయింది. ఆమె కేకలు వేయటంతో సదరు వ్యక్తి పారిపోయాడు. ప్రస్తుతం ఆమెకు చికత్స అందిస్తున్నారు.

గేదెను తప్పించబోయి కారుబోల్తా: ఒకరి దుర్మరణం

కూసుమంచి, మే 16: గేదెను తప్పించబోయి కారుబోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద శుక్రవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లు (54) తన అల్లుడు దొడ్డపనేని నర్సింహారావుతో కలిసి హైదరాబాద్‌లో తమ బంధువులకు అనారోగ్యంగా ఉండటంతో ఆసుపత్రిలో చేర్పి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి 9గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరగా మార్గమధ్యలో ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద ఫ్లైఓవర్ దిగగానే గేదె అడ్డు రావడంతో డ్రైవింగ్ చేస్తున్న వెంకటేశ్వర్లు సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌కు ఢీకొనడంతో కారు డోరు ఊడిపోయి వెంకటేశ్వర్లు తల డివైడర్‌కు తగిలింది. దాంతో తీవ్రంగా గాయపడ్డ అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు వేగంగా ఉండటంతో కారులోని బెలూన్స్ ఓపెన్ అయినా ఉపయోగం లేకుండా పోయిందని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాలొచ్చాయ్

» రెండు విడతల్లో పాఠ్యపుస్తకాల సరఫరా
» మొదటి విడతలో జిల్లాకు చేరిన 2,18,930 పుస్తకాలు
» ఇంకా రావాల్సినవి 4,65,810 రెండు విడతల్లో విద్యార్థులకు పంపిణీ


పాఠ్యపుస్తకాలను లారీలోంచి గోదాంలోకి దించుతున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 17: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం రెండు విడతలుగా పాఠ్యపుస్తకాల పంపిణీ జరగనుంది. జూన్‌లో పార్టు-1, ఆగస్టులో పార్టు-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తారు. పార్టు-1 పుస్తకాలు జూన్ 5 నాటికి 70శాతానికిపైగా జిల్లాకు చేరుతాయి. వాటిని వెంటనే సంబంధిత మండలాలకు పంపిస్తారు. మిగిలినవి కూడా మరో వారంలో వస్తాయని అంచనా వేస్తున్నారు. వచ్చిన వాటిలో చాలా వరకు మండల కేంద్రాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం నాటికి జిల్లాలో వంద శాతం పాఠ్య పుస్తకాలు మండలాలకు పంపించేందుకు ప్రణాళిక చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యారంగంలో చదివే విద్యార్థులకు సుమారు 6లక్షల 84వేల 740 పాఠ్య పుస్తకాలు అవసరమని అంచనా వేశారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందించడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. జూన్ 12 నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండటంతో పాఠశాలలు ప్రారంభమైన వారం విద్యాదినోత్సవం నాడు విద్యార్థులకు పుస్తకాలు అందించనున్నారు.

రెండు విడతల్లో..

పార్టు-1 పుస్తకాలు జిల్లాకు 5,17,274 అవసరం కాగా, పార్టు-2లో లక్షా, 67వేల, 466 పాఠ్యపుస్తకాలు అవసరమని గుర్తించారు. జిల్లా కేంద్రంలోని గోదాంకు మే 17 నాటికి 2లక్షల, 89వేల, 930 పుస్తకాలు వచ్చాయి. వాటిని మండల కేంద్రాలకు పంపిణీ చేసేందుకు కసరత్తు ప్రారంభించనున్నారు. పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ బుక్స్ కూడా ఉచితంగా అందించనున్నారు. ప్రస్తుతానికి వైట్ నోట్‌బుక్స్ 64,300, రూల్ నోట్‌బుక్స్ 15,000 వేలు గోదాంకు చేరాయి. మొత్తం 79వేల, 300లు జిల్లాకు చేరాయి. గత విద్యాసంవత్సరం జిల్లాలో 2.50 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. ఇటీవల 10 వేల మంది పదోతరగతి పూర్తి చేశారు. కొత్తగా వచ్చే విద్యార్థులకు, 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు కొత్తగా పాఠ్యపుస్తకాలు అందించనున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పుస్తకాలు మండల కేంద్రాలకు పంపించి విద్యార్థులకు అందించనున్నారు.

2.27 లక్షల మంది విద్యార్థులు

జిల్లాలో 2023-24 విద్యాసంవత్సరంలో 2.50లక్షల మంది విద్యార్థులు విద్య అభ్యసించారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నారు. మిగిలిన వారు ప్రైవేట్ విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ యాజమాన్యం నుంచి 10 వేల పైచిలుకు మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆయా విద్యార్థులు పోగా మిగిలిన విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందనున్నాయి. దీంతో పాటు కొత్తగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చేరే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేలా అంచనాలు రూపొందించి పుస్తకాలను తెప్పిస్తున్నారు. రెండో విడత పాఠ్యపుస్తకాలు మరో రెండు నెలల్లో వస్తాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా ఇప్పటి వరకు 1, 2, 4, 10 వ తరగతికి చెందిన కొన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. కాగా ఈ నెలాఖరుకు మొత్తం పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి రానున్నాయి.

మున్నూరుకాపులు అన్నిరంగాల్లో రాణించాలి

» మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా కొండా దేవయ్యపటేల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేవయ్యపటేల్

పినపాక/అశ్వాపురం, మే 17: వ్యవసాయం చేస్తూ, దేశానికి పట్టెడన్నం పెట్టి కాపుకాసే మున్నూరుకాపులు ఆర్థిక, సామాజిక రాజకీయ రంగాల్లో వివక్షతకు గురయ్యారని, ఈ వెనకబాటును అధిగమించి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా కొండా దేవయ్యపటేల్ ఆకాంక్షించారు. మున్నూరుకాపు చైతన్యయాత్రలో భాగంగా పినపాక మండలంలో పర్యటించిన ఆయన, సింగిరెడ్డిపల్లి గ్రామంలో మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు బొడ్డు ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురై, కార్పొరేషన్ కోసం అనేక పోరాటాల కృషి ఫలితంగా మున్నూరుకాపు కార్పొరేషన్ సాధించామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవడం గొప్ప పరిణామమన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన జిల్లా బాధ్యులు, మండల సంఘం నాయకులు ప్రసంగించారు. మండలానికి తొలిసారి వచ్చిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్యపటేల్‌ను మండల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్నూరుకాపు చైతన్యయాత్ర పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసాల వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు నర్సింహారావు, మండల మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి తోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పసునూరి అంజయ్య వెంకన్న , మండల కమిటీ సభ్యులు గంగ్రాతి ప్రవీణ్, బొడ్డు మంగయ్య, కృష్ణ మోహన్, శాఖమూడి వెంకటయ్య, మేచినేని బలరాం, రాయపురెడ్డి సుబ్బారావు, కె బలరామకృష్ణ, గుత్తి మల్లయ్య, సాయిరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

అశ్వాపురం: మున్నూరుకాపులు ఐక్యంగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొండికుంటలో సంఘం మండల అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మున్నూరు కాపులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం దేవయ్యను నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఆసా శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి మూసా అనిల్, మొండికుంట ఎంపిటిసి కమటం నరేష్, సంఘం నాయకులు కాసరబాద రాములు,పర్వత నరేష్,తోటనాగయ్య తదితరులు పాల్గొన్నారు.



నకిలి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కొత్తగూడెం అర్బన్, మే 17 : నకిలీ విత్తనాలు అమ్మే ఫెర్టిలైజర్ షాపులపై విత్తనం చట్టం ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి. బాబురావు అన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇటీవల కోడిపుంజులవాగు ప్రాంతానికి చెందిన కొంతమంది రైతులు తనకు నకిలీ విత్తనాల అమ్మిన వారిపై ఫిర్యాదు చేశారన్నారు. పంటదిగుబడి 40 బస్తాలు రావాల్సి ఉండగా 25బస్తాలు మాత్రమే వచ్చిందని తమకు పాల్వంచకు చెందినఓ షాపు వారు కర్నూల్ రామాసీడ్స్ విత్తనాలు అమ్మారని వాటి ద్వారానే దిగుబడి తగ్గిందని ఫిర్యాదు చేశారన్నారు. ఈ అంశంపై కృషి విజ్ఞానకేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు పరిశీలన చేసి నివేదికలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలితే ఫెర్టిలైజర్‌షాపు లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తామని ప్రభావాన్ని బట్టి ఏజెన్సీని, లైసెన్స్‌ను రద్దు చేస్తామన్నారు.

ఈ ఏడాదీ అవస్థలు తప్పవా..?

అటవీ గ్రామాల్లో అధ్వానంగా రహదారులు

అటవీ అనుమతుల కారణంగా ప్రారంభం కాని పనులు

వర్షాకాలంలో తిప్పలు.. ప్రాణం మీదికి వస్తే జెడ్డీ కట్టాల్సిందే



వాహనాల దుస్థితి ఇదీ..

చర్ల, మే 17: రోజు రోజుకీ రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నా, ఏజెన్సీలో మాత్రం అభివృద్ధి కనిపించడం లేదు. ఇందుకు చర్ల మండలం నిదర్శనం. మండలంలో అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేక నేటికీ గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఇక వర్షా కాలం అయితే వారి బాధలు వర్ణనాతీతం, అనారోగ్య సమస్యలు ఏర్పడితే వారికి దేవుడే దిక్కు. ఇలాంటి గ్రామాలకు దృష్టి లో ఉంచుకుని గత ఏడాది కేంద్ర ప్రభుత్వం నూతన రహదారుల నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. కానీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా ఈ ఏడాది కూడా గిరిజనులకు రహదారులు కష్టాలు తప్పేలా కనిపించడలేదు. ఒక వేళ పనులు ప్రారంభించినా ఇప్పటికిప్పుడు ఆ పనులు పూర్తయ్యేలా లేవు.

రోడ్లు లేని గ్రామాలు ఇవీ..

చర్ల మండలం పూర్తిగా ఏజెన్సీప్రాంతం. ఇక్కడ వసల ఆదివాసీలతో పాటు స్థానిక గిరిజనులు స్థిర పడ్డారు. కాగా మండలంలోని 26 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొర్కట్ పాడు, ఎర్రంపాడు, కిష్టారం పాడు, రాళ్లాపురం, బట్టిగూడెం, తిమ్మిరి గూడెం, కమలాపురం, గ్రామాలకు గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. ఆయా గ్రామాల్లో సుమారు 60 నుంచి 700 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ నిర్మాణాలకు గత ఏడాది నిధులు మంజూరయ్యాయి. కానీ ఇప్పటి వరకు సంబంధిత కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. అటవీ అనుమతుల కారణంగా పనులు ప్రారంభం కానట్టు తెలుస్తోంది.

ఈ ఏడాది కూడా తప్పని తిప్పలు: రహదారి పనులు ప్రారంభం కాక పోవడంతో ఈ ఏడాది కూడా గిరిజనులకు తిప్పలు తప్పేలా లేవు, మండలాల్లో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రభుత్వం రహదారులు మంజూరు చేసింది. రహదారులు పూర్తి అయితే వైద్యంతో పాటు విద్య, ఇతర ప్రభుత్వ పథకాలు దరిచేరుతాయని ప్రభుత్వ ఆలోచన. రహదారి సౌకర్యం లేక ప్రతీ ఏడాది జెడ్డీలపై రోగులను వైద్యం కోసం తీసుకెళ్ళిన ఘటనలు లేక పోలేదు. కాగా ఈ ఏడాది రహదారులు పూర్తయ్యే పరిస్థితి లేక పోవడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ఎర్రంపాడు రహదారి

'రైతుబంధు' మినహాయించుకోవద్దు: కొత్వాల



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ టౌన్, మే 17: బ్యాంకు అధికారులు పాత బాకీల కింద రైతుబంధు పథకం ద్వారా మంజూరు అయిన పైకాన్ని రైతుల వద్ద నుంచి వసూలు చేస్తే సహించేది లేదని డీసీఎంఎస్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని బిక్కుతండ, కమ్మవారిగూడెంకు చెందిన రైతులు పాల్వంచలోని యూనియన్ బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం రైతుబంధు పథకం కింద పైకాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఆ పైకాన్ని బ్యాంకు అధికారులు అప్పు కింద మినహాయిస్తున్న విషయాన్ని రైతులు ఆయన దృష్టికి తేగా వెంటనే స్పందించిన ఆయన నేరుగా బ్యాంకుకు వెళ్లి మేనేజరు కె.నాగ శ్రీకాంత్, సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తుందని, ఆ పైకాన్ని బ్యాంకు అధికారులు పాత అప్పు కింద జమ చేసుకుంటే ఊరుకోబోమన్నారు. త్వరలో ప్రకటించనున్న రైతురుణమాఫీ పైకముతో వారి అప్పులు పూర్తిగా తీరిపోతుందన్నారు. దీనికి స్పందించిన బ్యాంకు మేనేజరు రైతులకు మంజూరు అయిన పైకాన్ని వెంటనే అందచేశారు. ఈ సందర్భంగా రైతులు కొత్వాలను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, నాయకులు బాలిశేని నాగేశ్వరరావు, ఎలికా సత్యనారాయణ, వజ్జల రాము, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చుంచుపల్లి, మే 17: ఈ నెల 24 నుంచి ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నామని ఇంటర్మీడియట్ నోడల్ అధికా సులోచన రాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు రెగ్యులర్ ఇంటర్మీడియట్ విభాగంలో పరీక్షలు జరుగుతాయని, వచ్చే నెల జూన్ 3వ తేదీన ఒకేషనల్ విభాగంలో పరీక్షలు జరుగుతాయన్నారు. దీనిని గమనించి ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో ఫీజు చెల్లించాలని తెలిపారు.

జీఎం దృష్టికి సింగరేణి సమస్యలు

మణుగూరుటౌన్, మే 17: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఏఐటీయుసీ ఆధ్వర్యంలో నాయకులు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ఏరియా జీఎం దుర్గం రాంచందర్ దృష్టికి శుక్రవారం తీసుకువెళ్లారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఏరియా జీఎం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామినిచ్చినట్లు ఏఐటీయుసీ నాయకులు విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.లక్ష్మీనారాయణ, దుర్వాల సుధాకర్, తోట రమేష్, ఆదెర్ల సురేందర్, అవినాష్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

తీర్మార్ మల్లన్నను గెలిపించాలి



మాట్లాడుతున్న కోరం కనకయ్య

ఇల్లెందు, మే 17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నహాక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ అమలుచేస్తున్న పథకాలను విద్యావంతులు గుర్తించి బలపరచాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ ఎంసీ నాగిరెడ్డి, పట్టభద్రుల సంఘం నాయకులు రమేష్ గౌడ్, విద్యాసాగర్, సమ్మిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

పాల్వంచ టౌన్, మే 17: నిబద్ధతతో పార్టీలో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. ఇటీవల పాతపాల్వంచకు చెందిన పలువురు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో పార్టీలోచేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో సీఆర్‌భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారికి పార్టీ సభ్యత్వాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంఘాల బాధ్యతలు స్వీకరించి నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎళ్లవేళలా అప్రమత్తంగా ఉండాలని కోరారు. వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితిసభ్యులు ముత్యాల విశ్వనాధం, పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి రాష్ట్రసమితి సభ్యులు విశ్వనాధం, పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్. శ్రీనివాస్, ఎస్‌కే. పాషా, జకయ్య, ఎండీ గౌస్, ఎస్‌కె. రెహమాన్, ఎండీ అంజాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాబీర్ పాషా

రాందాస్ లేనిలోటు తీర్చలేనిది



మాట్లాడుతున్న శాంతిరాం

కొత్తగూడెం, అర్బన్ 17: తెలంగాణ తొలిదశ ఉద్యమనాయకుడు పోలిశెట్టి రాందాస్ సంతాప సభ కొత్తగూడెంలోని టీచర్స్ భవన్‌లో శుక్రవారం జరిగింది. తెలంగాణ సమరయోధుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ఆ సంఘం అధ్యక్షులు వి.శాంతిరాం మాట్లాడుతూ 1969లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన రాందాస్ లేని లోటు తీర్చలేనిదని అన్నారు. పోలిశెట్టి రాందాస్ విగ్రహన్ని బస్టాండ్ సెంటరులో ప్రతిష్టించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంతాప సభలో డోర్నాల పాపారావు, గొల్లపల్లి దయానంద్, చింతలచెర్వు గెర్షోం, అనంతరెడ్డి, వందనపు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

33కేవీ లైన్‌కు మరమ్మతులు



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కొత్తగూడెం అర్బన్, మే 17: పాల్వంచ సీతారాంపురం సబ్‌స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు ఉన్న 33 కేవీ, సర్క్యూట్ -1 లైన్‌కు విద్యుత్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ తీగలు పక్కన ఉన్న చెట్లకొమ్మలను తొలగించారు. రానున్న వర్షాకాలం దృష్ట ఇటీవల విస్తున్న గాలులు దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు ఎఈ ఎ. రఘురామయ్య శుక్రవారం తెలిపారు. ఈ మరమ్మతు కార్యక్రమంలో ఫోర్‌మెన్ నర్సింహారావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిద్దాం: రేగా

మణుగూరు, మే 17: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతిఒక్క నాయకుడు కార్యకర్త శ్రమించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కిన్నెర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యాకర్తలు సోషల్ మీడియాను ఎంతమైరకైనా వాడుకుని ప్రచారాన్ని ముమ్మరం చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షులు అంతా పట్టభద్రల జాబితా ప్రకారం ఆయా గ్రామాల్లో ఉన్న పట్టభద్రులను కలుసుకుని పార్టీ అభ్యర్థి గెలుపుకు పాటుపడాలన్నారు. అనవరసంగా నోరు పారేసుకునే మాటలు మాట్లాడకుండా పనిచేయాలని అన్నారు. దురుసుగా మాట్లాడే వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తప్పకుండా ఉంటాయని హెచ్చరించారు. అటివారిని సస్పెండ్ చేస్తామని ప్రకటించారు. ఎలాంటి ఆగ్రహావేశాలకు లోను కాకుండా ఖచ్చితంగా పినపాక నియోజకవర్గంలో దాదాపు 8 వేల పట్టభద్రుల ఓట్లను తొలి ప్రాధాన్యతా ఓటు మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థికి పడే విధంగా నాయకులు కార్యకర్తలు శ్రమించాలన్నారు. ప్రశ్నించే నైజం ఉన్న బీఆర్ఆర్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డి అని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సతీష్ రెడ్డి, ముత్యం బాబు, నరసింహారావు, పోశం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగా కాంతారావు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

పాల్వంచ టౌన్, మే 17: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331వ ఆరాధనా మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారు వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పెద్దోజు నాగచారి ఆధ్వర్యంలో తెల్లవారుఝాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శాంతి హమం జరిపారు. పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ బాధ్యులు బండారు సత్యనారాయణ, దురుసోజు వైకుంఠనాథ్, చింతోజు బ్రహ్మారావు, శ్రీపాత సత్యనారాయణ, బి. తిరుపతి, మధు, మోత్కూరి రవి, రఘుమాచారి, శ్రీమన్నారాయాణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండలో..

చంద్రుగొండ: చంద్రుగొండ శివారు అయిన్నపాలెంలో శుక్రవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని త్రిమూర్తుల ఆలయంలో 331వ ఆరాధన మహోత్సవాలను పూజారులు కృష్ణమాచారి, రామలింగేశ్వరచారి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వారాధి రామాచారి, వెంకటాచారి, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలం: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 331వ ఆరాధన మహోత్సవం శుక్రవారం పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా భక్తులు సైతం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కొత్తగూడెం డిపోకు 122 శాతం లాభాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 17: ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఆర్టీసీ డిపో 122 శాతం ఆదాయం లభించిందని డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం డిపో ప్రాంగణంలో ఉద్యోగులకు స్వీట్లను పంపిణీ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు సర్వీస్‌లు నడిపించగా ఎక్కువ మొత్తం ఆదాయం ఆర్జించిందన్నారు. అందులో భాగంగా కొత్తగూడెం డిపో ఆరు రోజుల పాటు 33,576 కిలో మీటర్ల దూరం ప్రయాణించి రూ.25,83,078 రావడంతో 122 శాతం నమోదు అయిందన్నారు. సాధరణ రోజుల్లో కంటే ఈ ఎన్నికల్లోనే అధిక మొత్తం రావడంతో ఉద్యోగులను రీజనల్ ఉన్నత అధికారులు ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఉద్యోగులు తమ ఆరోగ్యం కాపాడుకునేందుకు సమయ పాలనతో పాటు, పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. ఆరోగ్యం పట్ల ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎం సూచించారు.



ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

తునికాకు ధర నిర్ణయించాలి

దుమ్ముగూడెం, మే 17: ధర నిర్ణయించకుండా తునికాకు కోయిస్తున్న కాంట్రాక్టర్ కార్మికుల పొట్టకొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ సంఘం డివిజన్ కార్యదర్శి సాయన్న ఆరోపించారు. పైడిగూడెం, చింతగుప్ప తునికాకు కల్లాలను శుక్రవారం సందర్శించారు. సంబంధిత అధికారులు కాంట్రాక్టరుతో చర్చించి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగు బోనస్ చెల్లించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

ఇల్లెందు, మే 17 : సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంచాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కోరారు. శుక్రవారం స్థానిక చంద్ర కృష్ణమూర్తి భవనం కాంట్రాక్టు కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన పది సంవత్సరాల్లో టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు వేతనాలు పెంచ లేదన్నారు. అనంతరం 15 మందితో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బ్రాంచి కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పా యం వెంకన్న, వెంకటనాయక్, బాలుచౌహాన్, రాజేష్, మోహన్, సత్యనారాయణ, సుమిత్ర పాల్గొన్నారు.

దేవాకు సీఎం అభినందనలు

దుమ్ముగూడెం, మే 17: కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ది దేవాను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాదులో ఓ హోటల్‌లో రాష్ట్ర, జిల్లా సోషల్ మీడియా విభాగంతో సీఎం సమావేశమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచి పనితీరు కనబర్చిన దేవాను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ మన్నె సతీష్, కో-ఆర్డినేటర్ పెట్టం నవీన్ తదితరులు ప్రశంసించారు.

'కాంగ్రెస్‌ది రోజుకో మాట..పూటకో అబద్ధం'

ఇల్లెందు మే 17: మోసపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలుచేయకుండా దగా చేస్తుందని, రైతులను నిలువునా మోసగించిందని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఆరోపించారు. రైతుల అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500బోనస్ చెల్లించాలని కోరుతూ ఇల్లెందులో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిప్రియ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చెప్పిన హామీల్లో అనేక కొర్రీలు పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమ పథకాల్లో కోతలుపెడుతుందన్నారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్‌రావు, గిన్నారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నేతల నిరసన

'గూడెం' ఆస్పత్రుల్లో రోగులు బారులు

ఓపీల వద్ద భారీగా చేరుతున్న ప్రజలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 17: వాతావరణంలో ఆకస్మికంగా వచ్చిన మార్పులతో ఆ ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడింది. కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి పరిధిలోని జిజిహెచ్, రామవరం ఎమ్‌పిహెచ్, పెనగడప, రేగళ్ల, సుజాతనగర్, పాత కొత్తగూడెం తదితర పీహెచ్‌సీలలో ఓపీల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలు ఒక్క సారిగా అకాల వర్షాలు కురవడంతో బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్దులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ క్రమంలో డిహైడ్రేషన్‌కు గురై వైద్య చికిత్సలు పొందేందుకు ఆసుపత్రుల్లో రోగులు క్యూ కడుతున్నారు. మహిళా ఓపీ సౌకర్యాలు లేకపోవడంతో పురుషుల ఓపీల వద్దనే సిబ్బంది మొగ్గు చూపడంతో మహిళలు బారులు తీరారు. వాతావరణంలో వస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరుతున్నారు.



కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో రోగులు

కనీస వేతనాలు అమలు చేయాలి

ఇల్లెందు, మే 17 : తెలంగాణలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలను అమలు చేయాలని సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటీయూసీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి కె.సారయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటీయూసీ మహాసభ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ఉన్న నిత్యవసర ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మికశాఖ విడుదలచేసిన ప్రిమియరి నోటిపికేషన్‌లో పొందుపర్చిన వేతనాల ప్రతిపాదన సక్రమంగా లేదని ఆరోపించారు. తక్షణమే ఉపసంహించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెం: 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో అనేక రంగాల కాంట్రాక్టు కార్మికులతోపాటు సింగరేణి కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని వివరించారు.